



# బ్రతుకు తెరువు వెదుక్కో!

-డి. కామేశ్వరి

'అమ్మగారో—మా అమ్మ పడిపోనాది, కాలు మోపు సేసింది యియాల కారియరు తీసికెళ్ళడానికి రాదమ్మగోరూ'-పదేళ్ళ రంగి చావు కబురు చల్లగా చెప్పింది గుమ్మం దగ్గిర నిలబడి గొణుగుతూ—

'ఓసి నీ అమ్మ కడుపుడకా, యిప్పుడటే వచ్చి చెపుతావు — పొద్దుటనించి ఏం చేశావే, ఈ కబురు ముందే చెపితే అబ్బాయే పట్టుకు పోయేవాడుకదా క్యారియరు. ఒసేవ్ కాంతం విన్నావుటే' అంటూ కోడలిని కేకపెట్టింది వర్ధనమ్మ—'అయినా మీకు మరీ తెగులెక్కు లావయి పోతున్నాయే. రాని మనిషి పొద్దుటే కబురెట్టద్దూ'-వర్ధనమ్మ కేకలకి పదేళ్ళ రంగి తలుపు చాటున నిలబడి బితుకు బితుకుమని చూస్తాంది.

'దిష్టి మొహం వేసుకుని యింకా ఎందుకు అక్కడ నిలబడ్డావు—పో—పోయి మీ అయ్యని రమ్మను యీ పూటకి'—

'అయ్య కూలిపనికెళ్ళిపోనాడండి' — లోపల్నించి కాంతం వచ్చి అత్తగారిని ఆపుతూ 'ఏమయిందే మీ అమ్మకు?' అంది.

'ఇందాక కడవెత్తుకు వస్తుంటే కాలుజారి పడిపోనాది-కాలు మోపు సేసింది లెగనేకపోతుంది' అంది రంగి.

'పోనీ నీవు పట్టుకెళ్ళి యిచ్చిరా యీపూట-' వర్ధనమ్మ అంది.

'నాకు తెలదండమ్మగోరూ-మూడు మైళ్ళు నేనెట్టా ఎల్తానండి' అంటూ మరి నిలవకుండా పరుగెత్తింది రంగి.

'హు—ఆయనకీపూట పస్తే రాసిపెట్టి వుంది. నెలాఖరు. జేబులో దమ్మిడి లేదు. ఆయనకిష్టం అని మజ్జిగ పులుసు చేశా—తినే ప్రాప్తం లేదు ఆయనకి—రోజంతా పస్తే—ఎవరు తీసికెడతారు? యింట్లో ఎందరున్నా సమయానికి ఒకరూ పనికి రారు—ఎవరిని ఎమనడానికి భయమే'—కాంతం నిష్ఠూరంగా ఓ విసురు విసిరి లోపలికెళ్ళింది.

సావిట్లో కూర్చుని పేపర్లో వాంటెడ్ కాలమ్స్ శ్రద్ధగా పఠిస్తూ జరుగుతున్న దానితో సంబంధం లేనట్టు నిర్విచారంగా కూర్చున్న రాంబాబుకి తక్కిన మాటలు ఏమీ వినపడలేదుగానీ-ఆఖర్న వదినగారి విసురు బాగానే వినపడింది. చదువుతున్న పేపరు విసురుగా టేబిలు మీద పడేసి, చరచర వంటింట్లోకి వెళ్ళి సర్దిపెట్టి వున్న క్యారియరు తీసుకున్నాడు. "వదినా డైరక్టుగా చెప్పకూడదూ-ఈ విసుర్లెందుకు?" అన్నాడు.

"నిన్నేం అనలేదు బాబూ. నీకెందుకంత కష్టం? ఆ క్యారియరక్కడ పెట్టు. లేకపోతే ఉద్యోగం సద్యోగం లేదని క్యారియర్లు మోయిస్తున్నాం అంటావు"— కాంతం మూతి తిప్పింది.

"ఉద్యోగం లేని మాట నిజమే గనక అంటారు-కర్రలు, బొగ్గులు, కూరలు మోసుకు రాగా లేంది కారియరు తీసికెళితే తప్పేమిటి" రాంబాబు ఉక్రోషంగా అన్నాడు.


కాంతం మరిది చేతిలో క్యారియరు లాక్కుని 'మీ అన్నయ్యకి ఓ పూట తిండి లేకపోయినా భరిస్తాకానీ నీ సాధింపులు నేను భరించలేను' అంది విసురుగా—

రాంబాబు అంతకంటె విసురుగా క్యారియరు మళ్ళీ లాక్కుని 'యింట్లో యింతపెద్ద నౌకరు వుండగా అన్నయ్య పస్తు పడుకునే ఖర్మేమిటి—పావలా డబ్బులు ఇలా పారేయి సైకిలద్దెకు తీసుకు వెడతా—అన్నయ్యని పస్తుంచే పాపం నాకెందుకు' అన్నాడు.

రాంబాబుకీమధ్య—అంటే ఉద్యోగం కోసం తిరిగి తిరిగి వేసారిపోయిన ఈ రెండేళ్ళనించి ప్రతిదానికి కస్సుమంటున్నాడు—ప్రతిదానికి కోపం. ఎవరేమన్నా తనకన్వయించుకుని ఉక్రోష పడ్తాడు. ఖాళీగా వున్నాడని ఏ చిన్న పని చెప్పినా ఉద్యోగం లేదని నౌకరులా ట్రీట్ చేస్తున్నారనుకుంటూ బాధపడిపోతాడు—ఇంట, బయట అందరి మాటలు చేతలు భూతద్దంలో చూసిన మాదిరి కనిపిస్తున్నాయి అతనికి.

రాంబాబు క్యారియరు పుచ్చుకుని తలుపు తీసి యివతలికి వచ్చేసరికి ఎదుటి వాటా ముసలమ్మగారు తలుపు దగ్గర నించుని ఆరాటంగా చూస్తూ "క్యారియర్ తీసుకెళ్తున్నావా నాయనా ఈ దొంగ ముండ చెప్ప చెయ్యకుండా మానేసింది పిల్లడీ పూట ఆకలితో వుండాలి. ఎలాగూ వెడ్తున్నావు కాస్త మా క్యారియరు కూడా తీసుకెళ్ళు నాయనా' అంది బతిమలాడుతూ. రాంబాబు ఏం అనలేక ఆ క్యారియరు పుచ్చుకున్నాడు.

అది పన్నెండు ఫ్లాట్స్ వున్న బ్లాకు—మూడంతస్థులు—ఒక్కొక్క దానికి నాలుగిళ్లు—రాంబాబు అన్న పనిచేసే ఫాక్టరీలో పనిచేసే వారే అందరూ—కంపెనీ ఫ్లాట్స్ అవి. రాంబాబు చెరో చేత్తో రెండు క్యారియర్లు పుచ్చుకుని మరో అడుగు వేసేసరికి మూడో యింటి గుమ్మం




దగ్గర కొత్తగా పెళ్ళయిన ఆ అమ్మాయి రాంబాబుని ఏం అడగాలో తెలియక భర్తకి క్యారియరు పంపలేకపోతున్నందుకు ఆరాట పడుతూ చూసింది. రాంబాబుకి జాలేసి 'మీ క్యారియరూ యిస్తారా' అన్నాడు. ఆ అమ్మాయి సంతోషంగా తలాడించి చప్పున క్యారియర్ తెచ్చి యిచ్చింది. 'మూడు క్యారియర్లు ఎలాగూ తీసికెళ్తున్నావు మాది కూడా తీసికెళ్ళి పుణ్యం కట్టుకో బాబ్బాబు' అంది నాలుగో యింటి యిల్లాలు.

మొత్తంమీద రాంబాబు ఆఖరి మెట్టు దిగే సరికి ఆ పన్నెండిళ్ళ వాళ్ళు పన్నెండు క్యారియర్లు అంటకట్టేశారు—రాంబాబు ఏం అనాలో తెలియక తెల్లపోతూ నిల్చున్నాడు—వాళ్ళలో ఓ ముసలాయన ఎదుటి సైకిలు షాపునించి అద్దెకి సైకిలు తెచ్చాడు—రాంబాబు ఏదో అనే లోపలే ఆయనే వెనక—ముందు—హేండిల్ బార్‌కి కారియర్లన్నీ సర్దేసి కట్టేశాడు—ఇరుగు పొరుగు వాళ్ళని గట్టిగా కాదనలేని రాంబాబు బిక్క మొహం పెట్టి సైకిలు ఎక్కాడు—పరోపకారం ఇదం శరీరం అన్నట్టు సైకిలు తొక్కడం మొదలుపెట్టాడు రాంబాబు.

ఫాక్టరీ అక్కడికి మూడుమైళ్ళుంది. ఆ మూడు మైళ్ళు చేరేలోపల కనీసం ముఫైమందన్నా రాంబాబుని—ఎరిగిన వాళ్ళు తెల్లపోయి చూశారు. కొందరు ఆశ్చర్యంగా నోరెళ్ళ పెట్టారు. రాంబాబు స్నేహితుడొకడు సైకిలు పట్టి ఆపేసి "ఏరోయి యీ ఉద్యోగం ఎప్పటినించి?" అన్నాడు ఇటూ అటూ క్యారియర్లు చూపిస్తూ—రాంబాబు అసలు సంగతి చెప్పుకుని మళ్ళీ సైకిలెక్కాడు.

'ఏటిబాబూ యిన్ని క్యారియర్లుకట్టుకు బయలుదేరినావు' ఆఖరికి కిళ్ళీకొట్టువాడు, చాకలాడు——ఎదురుపడ్డ ప్రతీవాడు అదే ప్రశ్న!

సైకిలు తొక్కుతూ వెళ్తున్న రాంబాబుకి అందరి ప్రశ్నలు వినగానే బుర్రలో ఒక ఆలోచన తళుక్కుమంది. ఆ ఆలోచన తట్టగానే రాంబాబులో ఉత్సాహం పుంజుకుని చకచకా సైకిలు తొక్కసాగాడు.

*

"రామ్‌చంద్ అండ్ కో క్యారియర్ సప్లయర్స్" అన్న బోర్డు ఆ బిల్డింగ్ ముందు వేలాడుతూంది. ఆ అక్షరాలకి క్రిందుగా 'అండ్ ఎడ్వయిజర్స్ అండు ఫైనాన్సర్స్ ఫర్ జాబ్ సీకర్స్" అన్నది బ్రాకట్టులో రాసి వుంది.

ఆ బోర్డు ముందు నిలబడి ఒక యువకుడు రెండు నిమిషాలు చదివిందే చదివాడు. లోపలికి వెళ్ళడమో మానడమో తేల్చుకోలేక మరీ రెండు నిమిషాలు తచ్చాడి ఆఖరికి లోపలికి నడిచాడు.

ఎయిర్ కండిషన్డ్ రూములో రివాల్వింగ్ కుర్చీలో కూర్చుని అతి సీరియస్‌గా ఫైళ్ళు చూస్తున్న ప్రొప్రయిటరు రామ్‌చంద్ ముందు నిలబడ్డాడు. కొద్ది సేపట్లోనే—రామ్‌చంద్ వయసు నలభై సంవత్సరాలుండవచ్చు — సగం నెరిసిన జుత్తు, కళ్ళజోడు, సూటు బూటుతో ఠీవిగా

వున్నాడు. కాగితాలు చూస్తూనే 'ఎస్-వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ' అన్నాడు ఒకసారి కళ్ళెత్తి ఆ యువకుని చూసి.

"బైట బోర్డు చూసి ..."

"ఉద్యోగం దొరుకుతుందని వచ్చావు"— రామ్‌చంద్ పెన్ను పక్కన పెట్టి కుర్చీ చూపాడు అతనికి.

"అవునుసార్." వినయంగా అన్నాడు అతను కూర్చుంటూ — "ఏం ఉద్యోగం కావాలి?" కళ్ళ జోడు తీసి రూమాలుతో తుడుస్తూ నిశితంగా పరీక్షించసాగాడు రామ్‌చంద్..

"ఏదయినాసరేసార్-ఎమ్. ఏ. ప్యాసయ్యాను. రెండేళ్ళుగా ఎంత ప్రయత్నించినా ఏ ఉద్యోగం దొరకలేదు. యిల్లు గడపడం కష్టంగా వుంది. యీ నిరుద్యోగపు బ్రతుకు యింక బతకాలనిపించడం లేదు" ఆరాటంగా కష్టాల కథ ఏకరువు పెట్టాడు.

"సారీ, మీ చదువుకి సరిపోయిన ఉద్యోగం ప్రస్తుతం లేదు" యువకుని మొహం సూటిగా పరీక్షిస్తూ అన్నాడు రామ్‌చంద్—అతని మొహం చిన్నబోయింది.

"ఏదయినా పరవాలేదుసార్ — ప్రస్తుతానికి ఏదో చిన్న ఉద్యోగం అన్నా పరవాలేదు."

"ఏదయినా పరవాలేదా-"అంటూ రామ్‌చంద్ ఓసారి ఓ ఫైలు, ఓ పెద్ద ఖాతా పుస్తకం తీసి చూశాడు. 'మీకు అంతగా కావాలంటే క్యారియర్లు అందించే బాయ్ ఉద్యోగం ఒకటి ఖాళీ వుంది. అదీయగలను' అన్నాడు రామ్‌చంద్.

ఆ యువకుడు ఒక్క-క్షణం తెల్లబోయాడు— 'క్యారియర్ బాయ్ ఉద్యోగమా' అన్నాడు నమ్మలేనట్టు—అంతలోనే అతని మొహం ఎర్రబడింది.

"ఏం కావాలా?" రెట్టించాడు రామ్‌చంద్.

"సార్, చిన్న ఉద్యోగం అంటే ఏ గుమస్తాగానైనా అని గాని క్యారియర్లు మోసే కూలి ఉద్యోగం కాదు, మీరు నన్ను, నా చదువుని అవమానపరుస్తున్నారు.' ఆవేశంగా పౌరుషంగా అన్నాడు యువకుడు.

రామ్‌చంద్ ఆ ఆవేశం చూసి చిద్విలాసంగా నవ్వి, విలాసంగా సిగరెట్టు అంటించుకుంటూ 'ఉన్న ఉద్యోగం అది, కావలిసింది అక్కరలేనిది తేల్చుకోవలసింది మీరు' అన్నాడు కూల్‌గా.

'థాంక్స్' విసురుగా లేచాడు ఆ యువకుడు. "కూలిపనులే అయితే మీరిచ్చేదేమిటి? ఎక్కడైనా దొరుకుతుంది. ఆపాటి దానికి బయట బోర్డు యీ ఆఫీసు అట్టహాసం ఎందుకు, మా లాంటి వాళ్ళని చుట్టూ తిప్పుకుని ఫూల్స్‌చేసి పంపడానికా? ఉద్యోగాలు ఇస్తాం అన్న గొప్పలు ఎందుకు చెప్పుకున్నట్టు?" ఉడుకురక్తం ఉరకలేయగా ఆవేశంగా ధిక్కరించాడు ఆ యువకుడు. ఆ ధాటికి రామ్‌చంద్ బెదరలేదు. 'మిస్టర్ — మీ పేరేమిటన్నారు? గోపాల్ కదూ-మిస్టర్ గోపాల్- ఆ కూలీపనులు కూడా దొరకడం మీరనుకున్నంత సుళువు కాదు - ఏదీ ఒక పూట కూలి పని సంపాదించగలరేమో బైటికి వెళ్ళి ప్రయత్నించి చూడండి' అన్నాడు నవ్వి— ఆ సవాల్‌కి ఉక్రోషంతో మొహం ఎర్రబడింది గోపాల్‌కి. 'మిస్టర్ గోపాల్! మీరు ఆవేశపడకుండా ఒక్క-క్షణం ఆలోచించితే నేను అన్న మాట అబద్ధం కాదని అర్థం అవుతుంది. మిస్టర్ గోపాల్! మీలాంటి యువకులు పెద్ద పని చిన్న పని అని చూడకుండా ఏదిపడితే అది చేయడానికి సిద్ధపడితే గాని దేశంలో ఈ నిరుద్యోగ సమస్య తొలగిపోదు. విదేశాలలో మాదిరి అభ్యుదయం సాధించాలంటే — చిన్న పని చేయడానికి ముందుకు రావడంలో సిగ్గు పడాల్సింది ఏమీ లేదని మీలాంటి యువకులు గ్రహించి ముందడుగు వేయాలి ...'

'సార్—ఎయిర్‌కండిషన్డ్ రూములో కూర్చుని లక్షలు సంపాదిస్తూ ఉపన్యాసాలు చెప్పడం చాలా సుళువు—' వెటకారంగా నవ్వాడు గోపాల్.

'ఈ ఎయిర్‌కండిషన్ ఈ లక్షలు ఎన్నాళ్ళు శ్రమిస్తే వచ్చాయో నీకేం తెలుసు గోపాల్!'

'ఓహో క్యారియర్లు మోసి మోసీ సంపాదించారు కాబోలు' యింకాస్త వెటకారంగా అన్నాడు గోపాల్.

'ఎగ్జాట్లీ — నిజం కనుక్కు-న్నావు. ఈనాడు కోట్లకి పడగలెత్తిన టాటాలు చిన్న యినప కొలిమితో ఆరంభించే యిన్ని కోట్లు సంపాదించారన్న నిజం మరిచిపోయావా .... ఈనాడు లక్షలు ఆర్జించిన అందరికీ ఈ సూత్రం వర్తిస్తుందన్న విషయం మరవకు'

'థాంక్స్‌సార్. యీ ఉపన్యాసాలు చెప్పడానికేనా యింత పెద్ద ఆఫీసు పెట్టుకు కూర్చున్నారు' విసురుగా వెళ్ళబోయాడు.

---

ఇద్దరు మిత్రులు మాట్లాడుకుంటున్నారు:

"నిన్న నేనూ, మా ఆవిడా దెబ్బలాడుకున్నాం!"

"ఏం? ఎందుకనీ?"

"అబ్బే! మరేం లేదు....మా ఆవిడ సినిమాకు వెళ్ళాలంది. నేను అలా కాదు — బీచ్‌కి వెళ్ళాలన్నాను. మా ఆవిడేమో వెడితే సినిమాకే వెళ్ళాలని పట్టు పట్టింది. నేను ఊరుకుంటానా? బీచికే వెళ్ళాలని ఇంకా గట్టిగా...."

"అదే సరేగానీ, సినిమా ఎలా ఉందీ?"

అనగనగా ఒక సుబ్బయ్య ఒక పెద్ద మనిషి ఇంట పని మనిషిగా చేరాడు: పనులు చెయ్యడంలో అనుమానం తోచి 'అయ్యా! నేను మీరు చెప్పినట్టు వినాలా? అమ్మగారు చెప్పినట్టు వినాలా?' అని అడిగాడు.

అయ్యగారు సెలవిచ్చారు: "అమ్మగారు చెప్పిన దానికీ, నేను చెప్పిన దానికీ తేడా ఉంటే, అమ్మగారి మాటే విను. ఇద్దరు చెప్పిందీ ఒకే రకంగా ఉంటే నా మాటే విను...."

'మిస్టర్ గోపాల్ జస్ట్ ఎ మినిట్, మీరు ఒక పావు గంట టైము స్పేర్ చేయగలిగి నేను చెప్పేది వింటారా ?'

'పావుగంట ఏం ఖర్మ — నా లాంటి నిరుద్యోగికి అంతా ఖాళీయేగా కాని మీ నీతి బోధలు వినే ఓపిక మాత్రం లేదు.'

'నీతి బోధకాదు మిస్టర్ — నిజాలు, జీవిత సత్యాలు. నీలాంటి వారు విని నేర్చుకోవలసింది చాలా వుంది. నాకేం పని పాటలేక నీతో బాతాఖానీ వేసుకోడం కాదు. నేను చెప్పే మాటలు ఏ ఒక్కరి జీవితానికి వెలుగు నిచ్చినా నా కంతకంటె ఆనందం మరొకటి లేదు. నాకు చేతనయినంతగా మరొకరికి ఉపకారం చెయ్యడమే నా ధ్యేయం. కమాన్ సిట్‌డౌన్ మిస్టర్'' గోపాల్ మొహంలో కాస్త యింటరెస్ట్ కనిపించింది. వచ్చి కూర్చున్నాడు.

'మిస్టర్ గోపాల్—ఒకప్పుడు నీలా నేనూ నిరుద్యోగినే. డిగ్రీ చేతికి వచ్చాక రెండేళ్ళు ఎంత ప్రయత్నించినా ఏ ఉద్యోగం దొరకలేదు. అప్పటి నా మనస్థితి ఎలాంటిదో నీకు తెలుసు. తండ్రి లేడు—అన్న జీతం అంతంతమాత్రం—కాస్తో కూస్తో చదువు చెప్పించాక కూడా అన్నకి భారంగా బతుకుతూ అడుగడుగున నిరసనలు, హేళనలు, విసుర్లు, అవమానాలు అన్నీ సహిస్తూ ఎంతకాలం బ్రతకగలను. ఆ బాధ భరించలేక ఆత్మహత్య చేసుకోవాలన్న విరక్తి పుట్టింది.'

''కాని అంతలోనే అనుకోకుండా నా జీవితం మలుపు తిరిగింది. ఇదిగో యిటు చూడు. యీ ఫోటో ఎవరిదో తెలుసా! అప్పలమ్మ అని క్యారియర్లు మోసే మనిషిది! యింత పెద్ద ఆఫీసులో ఆ కూలి మనిషి ఫోటో ఏమిటని ఆశ్చర్యపోతున్నావా ? ఆమే యీనాడు నా స్థితికి కారకురాలు! ఆమే నాకు మార్గదర్శకురాలు! నా యీ అదృష్టం అంతా ఆమె కారణంగానే వచ్చిందని నా భావన!''

గోపాల్ ఆశ్చర్యంగా చూశాడు. ''అవును—ఓ రోజు మా అన్నయ్య ఫాక్టరికీ క్యారియరు తీసి కెళ్ళడానికి అప్పలమ్మ రాలేదు. అన్నయ్యకి ఆ రోజు నేను తీసికెళ్ళాల్సి వచ్చింది. నే నెలాగూ వెడ్తున్నానని మా యిరుగు పొరుగు వాళ్ళు క్యారియర్లన్నీ నాకు అంట గట్టారు. ఎవరినీ కాదన లేని మొహమాటంతో అందరి క్యారియర్లు సైకిళ్ళు మీద మోసు కెడ్తున్న నాకు ఆ రోజు శాపంగా కన్పించిన ఆ ఘటనే వరంగా రూపొందింది. 'ఈ ఉద్యోగం ఎప్పటినించి' అన్న అందరి వేళాకోళం, హేళన చేసిన ఆ భావనే నా అదృష్టానికి అలంబన అయింది. ఆ క్షణంలో అవమానం అన్పించిన ఆ సంఘటన ఒక్క క్షణం ఆలోచించగానే వరంలా కన్పించింది.

''అంతే-వెంటనే ఆచరణలో పెట్టేశాను—మా అప్పలమ్మ సాయంతో కొన్ని క్యారియర్లు సంపాదించాను. మిస్టర్ గోపాల్—ఎండలో చెమటలు కక్కుతూ ఎడాపెడా సైకిలుకి క్యారియర్లు తగిలించుకుని ఒక్కొక్కసారి డజను క్యారియర్ల చొప్పున మూడు నాలుగుసార్లు మూడేసి మైళ్ళు తొక్కుతూ నలభై క్యారియర్లు సరఫరా చేసేవాడిని. నెలకి రెండొందలు సంపాదించడానికి ఆనాడు ఎన్ని కష్టాలు పడ్డానో చెపితే నీవిపుడు నమ్మవు. శారీరక శ్రమకంటె యింట బయట అవమానాలు అవహేళనలు, అభ్యంతరాలు ఎదుర్కోడం ఎంతో కష్టమైంది. ఇంట్లో పరువు తక్కువ పనులు చేస్తున్నానని తిట్లు, సాధింపులు, బెదిరింపులు—మిత్రుల, పరిచయస్థుల వేళాకోళాలు! అవన్నీ పెడచెవిని పెట్టి మొండిగా అందరిని కాదని నిలబడడం చాలా కష్టమే అయింది. నెలతిరిగే సరికి రెండొందలు కళ్ళజూసేసరికి—రాజ్యాలు పొందినంత సంబరపడ్డాను. ఉత్సాహం పుంజుకుని—ఓ మూడు చక్రాల సైకిలుబండి అద్దెకు పుచ్చుకుని ఓ వంద క్యారియర్లు సప్లై చేయడం ఆరంభించాను. అంటే రాబడి ఐదువందలకి పెరిగింది. దమ్మిడి పెట్టుబడీ లేకుండా నెలకి ఐదువందలు కళ్ళబడడం చూసి — హేళన చేసిన మిత్రులు దగ్గిర చేరారు. అభ్యంతరాలు చెప్పిన పెద్దలు నా కార్యదక్షతని మెచ్చుకుంటూ భుజం తట్టారు.

•నాలాంటి మరో యిద్దరు నిరుద్యోగ మిత్రులు నాతో కలుస్తాం అన్నారు. ముగ్గురం కలిసి పని చేయడానికి నిర్ణయించాం—మరిన్ని క్యారియర్లు సరఫరా చేయగలిగాం. రాబడి వెయ్యికి పెరిగింది. రాబడితోపాటు ఆలోచనలూ పెరిగాయి. బ్యాంకు లోను తీసుకుని ఒక టెంపో వ్యాను కొన్నాం-ఒకరు క్యారియర్లు తీసుకొచ్చి వ్యాన్‌లో వేయడం, మరొకరు డ్రైవ్ చేయడం, మూడో వాడు క్యారియర్లు అందించడం—ఆ పద్ధతిలో మునపటికన్నా నాలుగురెట్ల క్యారియర్లు అందించగలిగేవారం. ఖర్చులు పోను ముగ్గురికి చెరి ఐదువందలు మిగిలింది. ఆ వచ్చిన లాభంతో మరొకరి పేర మరొక టెంపో అప్పుచేసి కొన్నాం. ఆ విధంగా బ్యాంకు లోను తీరుస్తూ—ముగ్గురం శ్రమపడుతూ నెలనెలకీ క్యారియర్ల సరఫరా సంఖ్య పెంచుకుంటూ నెలకి మూడు వేల ఆర్జనపరులయ్యాం.

ఇదంతా చెప్పడం సుళువుగా చెప్తున్నాను—అంత కష్టం మీద అన్ని అవరోధాలని దాటుకుంటూ ఒక్కొక్క మెట్టు ఎక్కి వచ్చాం—ముందులో క్యారియర్లు మోసుకెళ్ళే పనివాళ్ళు మామీద తిరగబడ్డారు — వాళ్ళ నోట దుమ్ము కొడ్తున్నాం అని దుమ్మెత్తి పోశారు. ప్రతి యింటికి తిరిగి తిరిగి క్యారియర్లు సంపాదించాల్సి వచ్చేది. చదువుకున్నవాళ్ళం అని — ఈ పనికి తలపడ్డాం అని జాలితో సానుభూతితో క్యారియర్లు మాకిచ్చేవారు అందరూ. అంతేకాక గంపలలో మోసుకెళ్ళే మనుష్యులకంటే మేము సైకిళ్ళ మీద, వ్యానుల మీద తీసికెళ్ళడం చేత యిల్లాళ్ళు మరో గంట రెండు గంటలు ఆలశ్యంగా సావకాశంగా వంట వండి క్యారియరు అందించవచ్చుననే ఉద్దేశంతో మమ్మల్ని ప్రిఫర్ చేసేవారు. బ్యాంకులోను తీరుస్తూ—పెట్రోలు ఖర్చులు భరిస్తూ ఇంటి ఖర్చులు భరించుకుంటూ మేము మిగుల్చుకునేది తక్కువే అయినా అంతటితో సంతృప్తిపడకుండా మా బిజినెస్ వృద్ధి చెందించాలన్న పంతంతో అహోరాత్రులు కష్టపడేవారం. ముగ్గురం మూడు టెంపో వ్యానులు డ్రైవ్ చేస్తూండడంతో క్యారియర్లు తీసుకొచ్చేవాళ్ళు, అవతల అందించే మనుష్యులు అవసరం అయ్యారు. గంపలతో క్యారియర్లు మోసే మనుష్యులు మా మీద దుఃఖపడ్తున్నారు అని ఆ పని వాళ్ళకే యిద్దాం అని వాళ్ళందరిని జీతాలకి మా కింద క్యారియర్లు అందించే మనుష్యులుగా పెట్టుకున్నాం.

మూడేండ్లు తిరిగేసరికి మా కింద ఆరు టెంపో వ్యాన్లు—ముప్పైమంది జీతగాళ్ళు—పదివేల క్యారియర్లు సప్లై చేసే స్థాయికి వచ్చాం—అంటే నెలకి ఏభై వేల రూపాయల రాబడి! జీతాలు, ఖర్చులు, అప్పులు, యింటి ఖర్చులు అన్నీ పోగా మిగిలిన లాభాలతో వ్యానుల మీద వ్యానులు కొనడం — మరిన్ని క్యారియర్లు; మరింతమంది జీతగాళ్ళు; యిలా వ్యాపారం అభివృద్ధి చేయసాగాం.

అంతదాకా వచ్చాక—బొంబాయినించి వచ్చిన ఓ మిత్రుడు మా ఉత్సాహం, కార్యదక్షత అంతా

# కొన్ని దక్షిణ భారతీయ వంటకాలు

## గోధుమ 'పిట్టు

ఇది చెయ్యడానికి ముఖ్యంగా గోధుమపిండి కావాలి. ఇడ్లీలు చెయ్యడానికి ఉపయోగించే బెజ్జాల పళ్ళెంమీద ఒక పొడి గుడ్డ పరచి దాని మీద గోధుమపిండిని పోసి, ఇడ్లీ పాత్రలో ఉంచి పది నిమిషాలపాటు ఆవిరిలో ఉంచాలి. తర్వాత దాన్ని నీడలో ఆరనివ్వాలి. (ఇలా ఆవిరిలో ఉంచి, ఆరబెట్టిన గోధుమపిండిని జాగ్రత్తగా ఒక డబ్బాలో వేసి ఉంచితే అవసరం వచ్చినప్పుడు వాడుకోవచ్చు.) అలా ఆరబెట్టిన గోధుమపిండిని రెండు కప్పులు తీసుకోవాలి. ఒక కొబ్బరి చిప్పను తురుముకోవాలి. గోధుమ పిండినీ, ఈ కొబ్బరి కోరునూ కొద్దిగా నీళ్ల చల్లి పిండిలా కలుపుకోవాలి. ఈ పిండిని గట్టిగా ముద్దలా కలుపుకోకూడదు.

తమిళులు పిట్టు చెయ్యడానికి గొట్టంలాంటి పాత్రను ఉపయోగిస్తారు. 'అలాంటి పాత్ర లేదే' అనుకోకుండా, వెడల్పు తక్కువ, పొడవు కొంత ఎక్కువా ఉన్న పాత్రను తీసుకుని దాని లోపలి అంచులకు నూనె పట్టించాలి. అందులో మొదట కొంత కొబ్బరి కోరు వెయ్యాలి. దాని మీద కలుపుకున్న పిండిని వదులుగా, పాత్ర నిండేదాకా వెయ్యాలి. ఇడ్లీ పాత్రలో నీళ్ళు పోసి, స్టవ్‌మీద ఉంచాలి. ఆ పాత్రలో ఈ పిట్టుచేసే పాత్రను ఉంచి ఆవిరి సోకనివ్వాలి. ఐదు నిమిషాలు ఆవిరి సోకనిచ్చాక, పాత్రను దించి పిట్టును బయటికి తీసి చక్కెరతో కలిపి తింటే బావుంటుంది.

## గోధుమ 'ఇడ్లి'

గోధుమలతో ఇడ్లీలు చెయ్యడానికి మామూలు పిండి గోధుమల కంటె ఎర్ర గోధుమలు ఉపయోగిస్తే బావుంటుంది.

ముందుగా గోధుమలను పిండిమరకు పంపించి సన్నని రవగా విసిరించుకోవాలి. ఈ రవతోపాటు ఈ ఇడ్లీలు చెయ్యడానికి మినప పప్పు, కొద్దిగా ఉప్పు, కాస్త వంట సోడా అవసరం.

మొదట నాలుగు కప్పుల గోధుమరవను తీసుకోవాలి. గోధుమ 'పిట్టు' చెయ్యడానికి ముందు చేసినట్టు ఈ రవనూ ఆవిరిలో 15 నిమిషాలు ఉడకనివ్వాలి.

ఒక కప్పు నిండా మినప పప్పు తీసుకుని, దాన్ని నీళ్ళలో నానబొయ్యాలి. పప్పు బాగా నానాక, దాన్ని బాగా రుబ్బుకోవాలి. తర్వాత ఈ రుబ్బిన పిండిని ఒక పాత్రలో తీసుకుని గోధుమరవను కలపాలి. అవసరమైనంత ఉప్పు వెయ్యాలి. ఉప్పు వేశాక పిండిని బాగా కలియబెట్టి పాత్రను అలాగే మూసిపెట్టెయ్యాలి. మర్నాడు ఆ పిండిలో కాస్త వంటసోడా వేసి–మామూలుగా ఇడ్లీలు చేసే తీరులోనే ఇడ్లీ పాత్రను ఉపయోగించి ఆవిరిలో ఉంచి ఇడ్లీలు చెయ్యాలి.

---

చూసి బొంబాయిలో క్యారియరు డబ్బా రవాణా అది ఎంత పకడ్బందీగా ఎంత క్విక్‌గా, ఎంత సిస్టమేటిక్‌గా జరుగుతుందో వివరించాడు. బొంబాయిలో రోజూ లక్షలకొద్ది క్యారియర్లు రవాణా అతి చురుకుగా ఒక రెండు గంటలలో ఎలా రవాణా అయిపోతాయో వివరించి-ఆ విధంగా మమ్మల్ని ఊరంతా క్యారియర్లు సప్లై చేస్తే బాగుంటుందని సూచించాడు. ఎలొచ్చి బొంబాయిలో రైళ్ళలో వెళతాయి క్యారియర్లు–ఏ చోటకి వెళ్ళాల్సిన క్యారియర్లు అక్కడికి చేరగానే అక్కడ మనుష్యులు సిద్ధంగా వుండి అవి అందుకుని ఏఏ ఆఫీసులు, స్కూళ్ళు చేరాల్సినవి చేరుస్తారు–ప్రతీ క్యారియరు డబ్బాకి తాళం వుంటుంది. ఆ డబ్బా మీద నెంబరు, వెళ్ళాల్సిన ఏరియా గుర్తు వుంటుంది – అన్ని లక్షల క్యారియర్లు రోజూ సరఫరా అవుతున్నా ఏదీ తప్పిపోకుండా కరక్టుగా సంకేత స్థలం ఎలా చేరుతుందో వివరిస్తుంటే మాలో ఉత్సాహం, ఉద్రేకం కట్టలు తెంచుకుంది, కార్యరంగంలోకి దుమికాము.

ఊరంతా మేమే క్యారియర్లు సప్లై చేయడానికి సంసిద్ధపడ్డాం–ప్లాన్లు తయారుచేశాం. ఈ నగరం జనాభా పదిహేను లక్షలు; రోజుకి లక్ష క్యారియర్లు సరఫరా చేయాల్సి వుంటుంది. స్కూలు పిల్లలు, ఆఫీసులకెళ్ళేవాళ్ళు, వెంట తీసికెళ్ళేవాళ్ళు తీసికెళ్ళగా లక్ష క్యారియర్లు సరఫరా జరుగుతూందని లెక్కలు తేల్చాయి. వెంటనే వూర్లో క్యారియర్లు తీసికెళ్ళే మనుష్యలందరిని సమావేశపరిచాం – వారికి ఒక్కొక్కరికి నూరు రూపాయల జీతం చొప్పున నిర్ణయం చేశాం–ఒక్కొక్క వీధికి ఒక్కొక్క మనిషి. ఆ మనిషి నూరు క్యారియర్లు వ్యాన్‌కి అందించాలి–తిరిగి ఖాళీవి యిళ్ళకి అప్పచెప్పాలి. ఒక డజను టెంపో వ్యానులు ప్రతీ వీధినుంచి తిరిగి క్యారియర్లు అందుకుని ఒక్కో వ్యాను ఒక్కో ఏరియాకి వెడతాయి. ఆ ఏరియాలో అక్కడ మనుష్యులు ఆ క్యారియర్లు అందుకుని ఎక్కడికి అందాల్సినవి అక్కడికి చేరుస్తారు. ఆ విధంగా పకడ్బందీగా ఏర్పాటులు జరిపాం. క్యారియరు మోసే మనుష్యులు వాళ్ళు మైళ్ళకొద్ది నడవక్కరలేకుండా వాళ్ళు సంపాదించేదానికంటే మేము ఎక్కువ జీతాలు యివ్వడంతో సంతోషంగా మాతో కల్సిపోయారు. ఊరంతా మేమే సప్లయ్ చేయడం ఆరంభమైంది. ఒక గంటలో క్యారియరు చేరుతుందని, యింట్లో యిల్లాళ్ళు సావకాశంగా వండి, వేడి వేడి భోజనం భర్త–పిల్లలు తినగలరని యిదివరకు ఉదయం వెంట తీసికెళ్ళేవారు కూడా మా సిస్టమ్ చూసి క్యారియర్లు యివ్వడం ఆరంభించారు. అనుకున్న దానికంటె బిజనెస్ దిన దినాభివృద్ధి పొందింది.

ఇంతమంది పనివాళ్ళు, డ్రైవర్లు, క్లీనర్లు వీళ్ళందరూ చేరడంతో ఆఫీసు తెరవవలసి వచ్చింది. మేం ముగ్గురం పార్ట్‌నర్స్‌గా ఆఫీసు తెరిచాం. లాభాలు మూడు వాటాలు; మేం ఆరంభించిన వేళావిశేషం ఏమిటోగాని మా యీ కంపెనీ దినదినాభివృద్ధి పొంది ఈ నాటికి యింతదయి లక్షలార్జిస్తున్నాం. రోజుకి లక్ష క్యారియర్లు సరఫరా చేసే ఆ సంపాదన కాక–ఇరవై టెంపో వ్యానులు క్యారేజి సప్లయి చేయడం అయ్యాక మిగతా టైమంతా అద్దెలకి తిప్పుతూ వుంటాం. ఈ నాడు మొత్తం మా క్రింద ఐదు వందల మంది పని చేస్తున్నారు. ఆఫీసు స్టాఫ్–డ్రైవర్లు-క్యారియరు బాయ్‌లు అన్ని రకాల వాళ్ళున్నారు–ఎక్కువమందికి జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో

ఒక్కొక్క క్యారియరు మనిషికి నూరు క్యారియర్లు అందించే పని మాత్రం యిచ్చాం—బిజినెస్ పెరిగిన కొద్దీ మేము ప్రొప్రయిటర్లగా ముగ్గురం మా మా పనులు కేటాయించుకున్నాం — నేను ఆఫీసు పని చూస్తే—నా మిత్రుడు ఒకడు క్యారియర్ సరఫరా సరిగా జరుగుతున్నదీ, పనివాళ్ళ అవసరాలు చూస్తాడు — మూడోవాడు వ్యానులు అద్దెకీయడం వాటి రిపేర్లు మొదలైన వ్యానులకి సంబంధించింది చూసుకుంటాడు''—

గోపాల్ ఆశ్చర్యంగా కథ వింటున్నట్టు వినసాగాడు కుతూహలంగా—"ఏం మిస్టర్ ఆశ్చర్యంగా నమ్మశక్యం కానట్టు అన్పిస్తూందా?'' రామ్‌చంద్ నవ్వుతూ అన్నాడు.

"నిజంగానే నమ్మశక్యం కావడం లేదు—క్యారియర్లు సరఫరా చేసి లక్షలార్జించారంటే—''

"అదే నేను చెప్పేది మిస్టర్—అలాంటి చిన్న పనులు చేయడం అవమానం, పరువు తక్కువ అనుకుంటే మనం ఎన్నటికీ పైకిరాలేం-విదేశాలు అంత ప్రగతి సాధించాయంటె ప్రతీవారు చిన్న, పెద్ద కష్టపడి పనిచేస్తారు. ఎంత చిన్న ఉద్యోగం అయినా చేయడానికి సిద్ధపడ్తారు. దొంగతనం—ముష్టి ఎత్తడం తప్ప యింకే పనన్నా అవమానకరం కాదనుకుంటారు. అందుకే ఆ దేశాలు బాగుపడ్డాయి. ఎటొచ్చి మన దేశంలోనే ఈ భేషజాలు — తినడానికి తిండిలేకపోతే పస్తులుంటారు కాని చిన్న చిన్న పనులు చేయడం పరువు నష్టం అనుకుంటారు. మన ఈ దృక్పథం మారేవరకు మనం బాగుపడం-చదువు విజ్ఞానానికి కాని ఉద్యోగార్జనకి మాత్రమే అనే దురభిప్రాయం తొలగిపోవాలి ప్రతివారికీ — చదివిన అందరికి ఉద్యోగాలు ప్రభుత్వం చూపలేదని దుయ్యపడితే ప్రభుత్వం ఎంతకని చూపగలదు!''

"కాని, అందరూ మీలాంటి అదృష్టవంతులే వుంటారా! ఎందరికి యిలాంటి అవకాశం దొరుకుతుంది. పోనీ ఏ స్మాల్‌స్కేల్ యిండస్ట్రియో ఆరంభించాలంటే బ్యాంకులో అప్పు తెచ్చుకోడం కూడా ఎంతో గగనమవుతూంటే ఏం చెయ్యగలం. అప్పు తెచ్చుకున్నా ఏ పరిశ్రమ ఆరంభించాలన్నా గవర్నమెంటు పర్మిట్లు, మెటీరియల్ దొరకడం ఆ అవస్థలు అన్నీపడే ఓపిక ఎందరికుంటుంది?''

'అవును. కాని ఇండస్ట్రీస్ స్టార్ట్ చెయ్యక్కరలేదు. ఓ టాక్సీ కొనుక్కో స్వయంగా నడుపుకో. ఓ నాలుగు గేదెలు కొని చిన్న డెయిరీ ఫారంగా ప్రారంభించు. ఓ ఏభై కోళ్ళు కొని చిన్న పౌల్ట్రీ ఫారం ఆరంభించు. అదీ కాకపోతే ఓ కిళ్లీ కొట్టు పెట్టు-యింకా ఓపిక వుంటే మీ యింట్లోవాళ్ళందరితో కలిసి చిన్న హోటలు ఆరంభించు—ఓ మొబైల్ రెస్టరెంటు ఆరంభించు. మిస్టర్—చెయ్యాలంటే ఎన్నో బ్రతుకుతెరువు మార్గాలున్నాయి. అన్నింటికంటె ముఖ్యం పట్టుదల, కార్యదక్షత, ఓపిక ముఖ్యం. వాటికంటె ముఖ్యమైనది చేస్తున్న పని అప్రదిష్ఠ, అవమానకరం అనుకుంటే ఏం సాధించలేరు. ఆ అహం వదులుకున్ననాడే జీవితంలో పైకి రాగలవు—'

'మిస్టర్ గోపాల్ యిదంతా యింత ఓపిగ్గా ఎందుకు చెప్పానో అర్థం అయిందా.'

'అర్థం అయింది. కాని యింత చెప్పినవారు నన్నేం చెయ్యమంటారో సలహా చెపితే మీకు కృతజ్ఞతలు చెప్పుతాను.'

'చెపుతాను. అందుకే అసలు ఈ ఆఫీసు వుంది. నీలాంటి నిరుద్యోగులకందరికి నా కథ చెప్పి వాళ్ళని ప్రోత్సహించి వాళ్ళకేదో ఒక బతుకు తెరువు ఏర్పరచడమే నా ధ్యేయం. కాని మిస్టర్ గోపాల్! నా దగ్గిరికి ఉద్యోగం కోసం వచ్చే అందరిని ముందుగా పరీక్షించేది ఏమిటో తెలుసునా! ఈరోజు నీకు క్యారియర్ బాయ్ ఉద్యోగం మాత్రం యిస్తానని చెప్పినట్టే అందరికి చెపుతాను. చిన్నతనం పరువు నష్టం అనుకోకుండా వెంటనే ఆ పనికి అంగీకరించిన వాళ్ళ మీద ప్రత్యేక శ్రద్ధ కనపరచి వాళ్ళకి మంచి పని దొరికేట్టు చూస్తాను. ప్రతీవాడు ఆఖరి మెట్టు నుంచి పై మెట్టు చేరుకోవడమే వాంఛనీయం! ప్రతి మెట్టు ఎక్కుతూ గమ్యం చేరుకోబోతూంటే శ్రమ మరచి ఏదో సాధించిన గర్వం, అనుభూతి రావాలి అందరికి. అలాంటి మనిషే జీవితంలో ఎదురు దెబ్బలకి తట్టుకుని నిలబడగలడు. అలాంటి మనిషే యితర్ల కష్టసుఖాలు గ్రహించగలడు. అందుకనే నా దగ్గిరికి ఉద్యోగం కోసం వచ్చే ప్రతి మనిషినీ ముందు ఆరునెలలు ఆఖరి మెట్టు ఉద్యోగంలో ఎప్రంటిస్‌గా అన్నట్టు వుంచుతాను. తను చేసే పని పరువు తక్కువది కాదు అని గర్వంగా తలెత్తుకు తిరిగే వీలు కల్పించాక, వారి వారి తాహతు, చదువులనిబట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తాను. అందుకు సిద్ధపడినవారే నా దగ్గిర పని చెయ్యాలి.'

గోపాల్ ఏదో చెప్పబోయి తడబడ్డాడు—రామ్‌చంద్ గోపాల్ మొహ కవళికలని పరీక్షిస్తూ "అదిగో ఇంకా అహం నీలో వదలలేదు. త్వరగా వదుల్చుకో మిస్టర్.''

"సరే, ముందు ఆరునెలలు క్యారియర్ బాయ్ ఉద్యోగం యిస్తారు. తరువాత ఎంతమందికని మీరు ఉద్యోగాలు యిస్తారు?'' గోపాల్ కుతూహలంగా అడిగాడు.

"అన్ని ఉద్యోగాలు నా దగ్గిరే వున్నాయని కాదు. నా పేరు ప్రతిష్ఠలు ఉపయోగించి మిగతా చోట్ల కొందరికి, వీలున్నంతవరకు నా క్రింద యిలా పనులు చూపుతాను. అలాంటి అవకాశం కనపడని చోట స్వయంగా ఏదన్నా చిన్న చిన్న బిజినెస్‌లు పెట్టుకోవాలనుకునే వారికి డబ్బు సమకూరుస్తాను. రిక్షా తొక్కుకోవాలంటే రిక్షా కొని యిస్తాను. టాక్సీ నడుపుకుంటానంటే టాక్సీ కొనే డబ్బు యిస్తాను. కిళ్ళీ కొట్టు, ఓ దుకాణం పెట్టుకోడానికి, ఓ కుట్టు మీషను, గేదెలు కొనడానికి ఎవరికి ఏ పనిలో ఉత్సాహం వుంటే దానికి సరిపోయే డబ్బు యిస్తాం—''

"వూరికేనా. అప్పుగానా?''

"అతి స్వల్ప వడ్డీకి యిస్తాం. మొదటి ఏడు అసలు వడ్డీ వుండదు. తరువాత వాళ్ళు తీసుకున్న డబ్బునుబట్టి ఏడాది కింత అని తీరుస్తారు.''

గోపాల్ ప్రశంసా పూర్వకంగా చూశాడు. "సార్ — నిజంగా యిన్ని కష్టనిష్ఠూరాలకి ఓర్చి మీరింత శ్రమ తీసుకోడం'' కృతజ్ఞతగా అన్నాడు.

"నే ననుభవించాను గనక నీలాంటివారు ఆ బాధలు పడకూడదని దానికి నా చేతులో వున్నంతవరకు సాయపడాలని నా ప్రయత్నం. ఇదీ ఒక బిజినెస్సే. డబ్బు పెట్టుబడి పెట్టడం వడ్డీలు అదీ—కాని, యిందులో కాస్తో కూస్తో పరోపకార చింత వున్నదని నీలాంటి వారు గ్రహిస్తే నా శ్రమకి ఫలితం వుంటుంది — కృతజ్ఞతలు చూపకపోయినా నా ఆశయాన్ని గుర్తిస్తే అదే పదివేలు....''

"సార్ — యిన్నాళ్ళు మీ దగ్గిరకి రానందుకు విచారిస్తున్నాను. మీరు నన్ను కొత్త మనిషిని చేశారు. మీ మేలు మరిచిపోను. రేపటి నుంచి పనిలో ప్రవేశిస్తాను సార్ — మిమ్మల్నే నమ్ముకున్నాను. నన్నేం చేసినా మీ యిష్టం—'' గోపాల్ గొంతు కృతజ్ఞతతో నిండిపోగా లేచి నిల్చుని చేతులు జోడించాడు. "మీకెలా కృతజ్ఞతలు చెప్పాలో, మీ ఋణం ఎలా తీర్చుకోవాలో ....''

రామ్‌చంద్ లేచి ఆప్యాయంగా గోపాల్ భుజం తట్టి — "తృప్తి, ఆనందం కంటె ఎవరైనా ఇచ్చేది ఏముంటుంది గోపాల్'' అన్నాడు సంతృప్తిగా.

*